క్లుప్తంగా

రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా



పమిడిముక్కల: రెడ్డిక సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు తన పదవికి రాజీనామా చేసినట్లు ఆదివారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందిన నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేశానని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ కార్యదర్శికి మెయిల్ ద్వారా తన రాజీనామా పత్రాన్ని పంపించినట్లు తెలిపారు. తనకు రెండు సార్లు డైరెక్టర్ పదవి ఇప్పించి, అన్ని విధాలా సహకరించిన మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కళారంగానికి పుట్టినిల్లు గుడివాడ



గుడివాడరూరల్: కళారంగానికి పుట్టినిల్లు గుడివాడ అని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక నీలామ హాల్‌రోడ్డులోని కళాకారుల సంఘ కార్యాలయంలో పేద కళాకారులకు ఆదివారం ఆయన పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులకు, నాట రంగానికి పేరుగడించిన ఘనత గుడివాడకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నెరుసు చింతయ్య, పలువురు మాజీ కౌన్సిలర్లు, కళాకారులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి దీవెనలు ఉండాలి



గుడివాడరూరల్: అభయాంజనేయస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక నీలామహల్‌రోడ్‌లోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి ముగిసిన సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సుబ్రహ్మణ్యం–వెంకటరమణ దంపతుల వితరణతో కమిటీ సభ్యులు సుంకర నాగార్జున, రత్నగిరి, పూజారి నందూరి రాంబాబుల ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని యలవర్తి ప్రారంభించారు. తొలుత స్వామికి యలవర్తి విశేష పూజలు నిర్వహించారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



గుడివాడరూరల్: ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం గౌరీశంకరపురంలోని ఆ సంఘ ప్రాంతీయ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత రాష్ట్ర, జిల్లా, మండల నాయకుల ఆధ్వర్యంలో ఆ సంఘ పతాక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడిన ఏకైక సంఘం ఎస్టీయూ అని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ నేత, అంతర్జాతీయ ఖో–ఖో రిఫరీ మడకా ప్రసాద్ 78వ ఆవిర్భావ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ఎన్ ప్రసాద్, జిల్లా నాయకులు పీవీఎన్‌డీ ప్రసాద్, కేవీ సత్యనారాయణ, ఎంఎస్ఆర్ పూజేశ్వరరావు, ఐ.అరవింద్ పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుల సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలో భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

నాణ్యమైన దిగుబడికి విత్తనాలే కీలకం



మినుము విత్తనాలు

పామర్రు: ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన పంట దిగుబడులు రావాలంటే విత్తనాలే కీలకం అని వ్యవసాయ అధికారులు తెలిపారు. అలాంటి విత్తన ఎంపికలో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఒకే బ్రాండ్ పేరుతో పలు రకాల విత్తనాలు విపణిని ముంచెత్తుతున్నాయి. ఏది ఎంపిక చేసుకోవాలో అర్థం కాక రైతులు తికమక పడుతున్నారు. ఇదే అదునుగా నాసిరకం విత్తనాలను కొందరు వ్యాపారులు అంటగడుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో విత్తనాల ఎంపికలో దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

రూ.6 కోట్ల విత్తన వ్యాపారం

నియోజకవర్గంలో ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే రూ.6 కోట్లలో విత్తన వ్యాపారం జరుగుతుంది. నియోజకవర్గంలోని పామర్రు, మొవ్వ మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తునే విత్తనాలను విక్రయిస్తుంటారు. ప్రభుత్వ లైసెన్స్ కలిగి, పేరు మోసిన డీలర్లు కొందరుంటే, రెట్టింపు సంఖ్యలో దళారులు విత్తనాల వ్యాపారాన్ని గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్నారు. వీరు చేసే వ్యాపారానికి ఎటువంటి రశీదులు ఉండవు. కొందరు డీలర్లు బ్రాండెడ్ పేరున్న విత్తనాల మాటున నకిలీలను రైతులకు అంటగడుతున్నారనే ఆరోపణలున్నాయి. విత్తనాల్లో కల్తీ వల్ల తేడా వస్తే అదునులో నాటుకోలేదని, విచ్చలవిడిగా ఎరువులు, పురుగుమందులు వేశారని దుకాణదారులు రైతులను మాయ చేస్తున్నారు. ఎకరం వరి సాగుచేయాలంటే కనీసం రూ.30 వేల వరకు పెట్టుబడి అవుతోంది. దిగుబడి రాకపోతే పెట్టుబడి గల్లంతే.

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

కొన్ని ఏళ్లుగా పామర్రు, మొవ్వ మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున విత్తనాల వ్యాపారం జరుగుతోంది. వీరి కింద కొందరు దళారులున్నారు. రెండేళ్ల క్రితం మొవ్వ మండలంలోని ఓ రైతు నకిలీ మినుము విత్తనాలను కొని మినుము పంటకు పూత, కాపు లేక పోవడంతో వేల రూపాయలు నష్టపోయారు. అదే విధంగా పామర్రు మండలం కొండిపర్రుకు చెందిన ఓ రైతు మినుము పంటకు ఓ నకిలీ పురుగుమందు చల్లినందు వలన పంట నష్టం ఏర్పడి నష్టపోయాడు. కొన్ని దుకాణాల వారు కొనుగోలుచేసిన వాటికి రశీదులు ఇవ్వరు. అంతా నమ్మకంతోనే వ్యాపారం సాగిస్తున్నారు. తేడాలు వస్తే రైతులపై నెపం మోపుతున్నారు.

తనిఖీలు చేయాలి

దళారులు, నకిలీ వ్యాపారుల నుంచి రైతులను కాపాడేందుకు వరి సాగుకు ముందుగా సంబంధిత అధికారులు వ్యాపార దుకాణాలపై పరిశీలన చేపట్టి తనిఖీలను నిర్వహించారు. నకిలీ విత్తనాలను ముందే గుర్తించి, వాటిపై తగు విధమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సరైన వ్యవస్థ లేక ఇబ్బందులు



సీజన్ వచ్చేనాటికి అనేక కంపెనీలు, దళారులు రకరకాల ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. ఏ విత్తనం కొనుగోలు చేయాలో అర్థం కాని పరిస్థితి. వ్యాపారులు దళారులు చెప్పిందే కొనుగోలు చేయాల్సి వస్తోంది. అమ్మకాలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండాలి. అలాంటి వ్యవస్థను ప్రభుత్వం కల్పించాలి.

– కె.సత్యనారాయణరెడ్డి, రైతు, పామర్రు

నమూనాలు సేకరిస్తున్నాం



విత్తన దుకాణాల్లో పరిశీలన చేస్తున్నాం. నిల్వలు పరిశీలించి, నాణ్యత తెలుసుకునేందుకు అవసరమైన చోట నమూనాలు సేకరించి పరీక్ష కేంద్రాలకు పంపిస్తున్నాం.

– శివనాగరాణి, ఏఓ, పామర్రు

కళాపీఠం సేవలు అభినందనీయం



హేమంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కళాపీఠం జిల్లా కార్యదర్శి నరేంద్ర, అధ్యక్షుడు మురళీకృష్ణ

పామర్రు: ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని యూటీఎఫ్ కృష్ణా జిల్లా కార్యదర్శి లంక నరేంద్ర అన్నారు. స్థానిక హితమ్ స్కూల్లో కళాపీఠం కార్యదర్శి నందిపాటి హేమంత్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాపీఠం ద్వారా అనేక ఉచిత సేవా కార్యక్రమాలను, కళాకారులను గుర్తించి వారికి తగు విధమైన సహాయసహకారాలను అందించడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఘంటసాల మధుర గీతాలను వినిపిస్తూ తమదైన శైలిలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం హేమంత్‌రెడ్డిని సత్కరించి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ, గౌరవాధ్యక్షుడు కోటి పాండురంగారావు, సభ్యులు ఎస్ నాగిరెడ్డి తదితరులు హేమంత్‌రెడ్డిని అభినందించిన వారిలో ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి



జమీదగ్గుమిల్లిలో విరాళాలు సేకరిస్తున్న చంద్రశేఖర్‌రావు, గ్రామస్తులు

జమీదగ్గుమిల్లి(పామర్రు): గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గంగానమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దాతలు మరింగా సహకరించాలని సర్పంచ్ కూన పరెడ్డి చంద్రశేఖర్‌రావు, గ్రామస్తులు పేర్కొన్నారు. మండలంలోని జమీదగ్గుమిల్లిలో ఏర్పాటు చేసే గంగానమ్మ ఆలయంలో గంగానమ్మ విగ్రహం కొనుగోలుకు గ్రామస్తులు భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఇంటింటికీ తిరిగి విరాళాలను ఆదివారం సేకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆలయాన్ని సుమారు రూ.35 లక్షలతో నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామస్తుల నుంచి వచ్చిన విరాళాలతోనే అమ్మవారి విగ్రహం కొనుగోలు చేసి ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు, గంగానమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాలపొంగళ్లశాల వద్ద నైవేద్యాలు తయారు చేసేందుకు సైతం భక్తులు పోటీ పడ్డారు. పలువురు మహిళా భక్తులు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. స్వామిని దర్శించుకునేందుకు అధిక సమయం క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. నాగబంధాల వద్ద గోశాల వద్ద మహిళలు భారీ ఎత్తున పూజలు చేశారు. నిత్యన్నదాన ప్రసాదానికి భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఇందుకనుగుణంగా సహాయ కమిషనర్ నేల సంధ్య చొరవతో ఆలయ కళామండపంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు ప్రసాదపు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

ప్రతి వారానికి పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఏసీ సంధ్య తెలిపారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం



కైకలూరు: నియోజకవర్గంలో ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తకు అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కూటమి నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడినా ఎవరూ ఆవేశపడవద్దని చెప్పారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు ఏలూరు రోడ్‌లోని పార్టీ కార్యాలయం వద్ద డీఎన్నార్‌ను ఆదివారం కలిశారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో పార్టీ ఓటమికి కారణాలపై చర్చించారు. ఎవరూ అధైర్యపడవద్దని క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు వెళదామని తెలిపారు. పందిరిపల్లిగూడెం కొల్లేరు పెద్దలు, కలిదిండి నుంచి ముస్లిం నాయకులు డీఎన్నార్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఘనంగా రెడ్డంకమ్మ జాతర



అవనిగడ్డ: స్థానిక తొమ్మిదో వార్డులోని కొత్త ఎడ్లంకలో వేంచేసియున్న రెడ్డంకమ్మ జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్షగాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. బట్టువారి కుల దైవంగా కొలుస్తున్న అమ్మవారికి అర్చకులు బట్టు నరసింహారావు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని ఈనెల 5వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా, ఆదివారం జరిగిన జాతర మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి పూజలు చేశారు.

రేపు కోదండ రామాలయం ప్రథమ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవం

మచిలీపట్నంటౌన్: నిజాంపేటలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయం ప్రథమ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం ఈ నెల 11వ తేదీ మంగళవారం నుంచి 13వ తేదీ గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ భక్త బృందం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆలయంలో 11వ తేదీ మంగళవారం అష్టోత్తర కలశ స్నపన (అభిషేకం), సాయంత్రం లక్ష మల్లికా కుసుమార్చన, 12వ తేదీన లక్ష తులసీ దళార్చన, సాయంత్రం శ్రీ సీతారాముల శాంతి కల్యాణ మహోత్సవం, 13వ తేదీ మూల మంత్రానుష్టాన హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం కూచిపూడి నాట్య ప్రదర్శన పాహి రామ ప్రభో సంగీత రూపకల్పం వంటి సాంస్కృతిక జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ ఆదివారం ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రశాంతంగా లాసెట్ ప్రవేశ పరీక్ష

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన లాసెట్–2024 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ఎస్ రెడ్డి, సెంటర్ అడ్మిన్ పి. అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగిన పరీక్షకు 192 మందికిగాను 166 మంది హాజరయ్యారని, 26 మంది ఆబ్సెంట్ అయ్యారని పేర్కొన్నారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష పూర్తయిందని వారు తెలిపారు.

ఘనంగా రాజశ్యామల యాగం



రాజశ్యామల యాగం నిర్వహిస్తున్న డాక్టర్ మనోజ్, వైష్ణవి

ముదినేపల్లి రూరల్: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ముదినేపల్లిలో ఆదివారం రాజశ్యామల యాగాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రముఖ వైద్యుడు అంబుల మనోజ్, కుమార్తె, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి ఈ యాగాన్ని నిర్వహించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే ధ్యేయంతో ఈ యాగాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో మనోజ్ హాస్పిటల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి పలు పార్టీలకు చెందిన నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పోకల నరసింహారావుకు ఘన నివాళి



నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కైకలూరు: కలిదిండి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోకల నరసింహారావు సేవలు చిరస్మరణీయమని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. ఇటీవల నరసింహారావు మృతి చెందగా, భాస్కరరావుపేటలోని ఆయన ఇంటి వద్ద సంస్మరణ సభ ఆదివారం జరిగింది. కుమారుడు పోకల జోగిరాజు కుటుంబాన్ని పలువురు టీడీపీ నేతలు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కేకే బాబు, మంతెన సుబ్బరాజు, వీరాబత్తిన సుధ, కంచర్ల రామకృష్ణ, పి.రాధాకృష్ణ, ఎండీ ఉస్మాన్, ఎండీ.జానీ, దుర్గం శ్రీనివాస్, రాంబాబు, నంగెడ్డ పవన్ పాల్గొన్నారు.

రెండు కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉంగుటూరు: మండలంలో ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లోని అబ్దుల్ కలాం నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఈ నెల 17వ తేదీ నుంచి ప్లంబింగ్, శానిటరీ ఫిట్టింగ్, కార్ రిపేర్‌పై శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18–35 సంవత్సరాల మధ్య వయసు ఉన్నావారు అర్హులని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి వంద శాతం ఉద్యోగ అవకాశం కల్పిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి ఉచితమని, ఆసక్తి కలవారు 95050 12312 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

పేదల నివేశన స్థలాలను మెరక చేయాలి



మండవల్లిలో పేదలకు లోతట్టు ప్రదేశంలో అందజేసిన నివేశన స్థలాలు

మండవల్లి: మండవల్లి తరుగుమూలలో నివేశన స్థలాలను మెరక చేసి, గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అనువుగా చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. 18 ఏళ్ల క్రితం 110 మంది లబ్ధిదారులకు అప్పటి ప్రభుత్వం నివేశన స్థలాలను మంజూరు చేసింది. వరి సాగు భూములను కొనుగోలు చేసి పేదలకు కేటాయించారు. పలు పర్యాయాలు లబ్ధిదారులు ప్రజాప్రతినిధులను కలిసి స్థలాలు మెరక చేయాలని విన్నవించుకున్నారు. అయినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. జన్మభూమి సమావేశాలు, స్పందన, గ్రామ సభల్లో భూములను మెరక చేసి గృహ నిర్మాణాలు చేపట్టాలని అర్జీలు ఇచ్చినప్పటికీ, స్పందించిన దాఖలాలు లేవు. కొందరు లబ్ధిదారులు ఇబ్బందుల పడి ఆర్థికంగా అవకాశం లేకపోయినప్పటికీ, నిర్మాణాలు ప్రారంభించకపోతే ప్రభుత్వ స్థలాలు దక్కవేమోనన్న భయంతో కొంత మేర మెరక చేసి సిమెంట్ పోల్స్ పాతి, నిర్మాణాలకు సన్నాహాలు చేశారు. అయినా వర్షం కురిస్తే మోకాళ్లలోతు నీళ్లు నివేశన స్థలాల్లో నిలిచిపోతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా నివేశన స్థలాలను మెరక చేసి, గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అనువుగా చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మండవల్లి హైస్కూల్లో 1989-90 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మండవల్లి: మండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 34 సంవత్సరాల తర్వాత ఒక చోట చేరిన విద్యార్థులు ఒకరికొకరు స్వాగతం చెప్పుకుంటూ ఆనందోత్సాహాలతో పలకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. అందరి చిరునామాలు సేకరించి అందరూ ఒకచోట కలుసుకోవడానికి కృషి చేసిన గోల్కొండ గోపి, బండి నాగేశ్వరరావు, ఎర్రబోతు శ్రీనివాసరావు, కాంద్రు చెల్లమ్మ, గుడివాడ రాజేశ్వరిని సత్కరించి, అభినందించారు. ఆనాటి గురువులు, డ్రాయింగ్ టీచర్ ఎల్ఎస్ భాస్కరరావు, హిందీ టీచర్ జానకిరామయ్య, తెలుగు టీచర్ ఏకే లక్ష్మి, ల్యాబ్ అసిస్టెంట్ అట్లూరి వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాము స్థిరపడేందుకు కారకులైన ఉపాధ్యాయులకు కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

వేసవి దుక్కులతో చీడపీడలు నాశనం



ట్రాక్టరు సాయంతో పొలం దున్నుతున్న రైతు

పామర్రు: వేసవి దుక్కులు చేయడం వల్ల, నేల పొరల్లో దాగి ఉన్న పురుగులు, వాటి గుడ్ల సమూహం సూర్యరశ్మి వేడి తగలడంతో నాశనం అవుతాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. వాలుకు అడ్డంగా దుక్కులు దున్నడంతో వర్షపు నీటిని పొలంలో ఇంకేటట్లు చేయడమే గాక, పొలం కోతకు గురికాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న పూడిక మట్టిని పొలాల్లో వేసుకోవడం ద్వారా పొలాల్లో కొత్త మట్టి చేరి, సారవంతంగా తయారవుతుందని తెలిపారు. దుక్కులను రైతులు తమ పొలాలను లోతుగా దున్నాలి. పంట కోతలు పూర్తయిన వెంటనే పొలాలను లోతుగా దుక్కి చేయటం వలన తొలకరి విత్తుకునే సమయంలో పంటకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దుక్కి సమయంలో పచ్చిరొట్ట, ఎరువులు వేయడం వల్ల తక్కువగా పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. పశువుల ఎరువు, ఒండ్రు మట్టి, గొర్రెల మందలోని ఎరువును పొలం నిండా చల్లుకుని దున్నాలని తెలిపారు. ఈ విధంగా చేయడంవల్ల పంటలకు కావాల్సిన పోషక పదార్థాలు భూమికి లభిస్తాయని పేర్కొన్నారు. కలుపు మొక్కలు పొలంలో పెరిగి పంటలకు నష్టం కలుగు జేస్తుంటాయని, వాటి వేర్లు కాయలు భూమిలో విస్తరించి ఉంటాయని తెలిపారు. దీంతో నివారణ చేయటం కష్టంగా మారుతుందని, పంటలు వేసేటప్పుడు పైరుతో పాటు పెరిగిన పంటలకు నష్టం కలిగిస్తాయని, వేసవి దుక్కులు చేయడంతో ఇవన్నీ పెకలించబడి, అధిక ఉష్ణోగ్రతకు నాశనం అవుతాయని పేర్కొన్నారు. వేసవి దుక్కులు అవశేషాలు లేకుండా చేసి నేలను శుభ్రంగా ఉంచి రైతులకు మేలు చేస్తాయని వ్యవసాయ అధికారులు తెలిపారు.

కేంద్ర మంత్రులకు బీజేపీ నేతల శుభాకాంక్షలు

కైకలూరు: తెలుగు రాష్ట్రాల నుంచి కేంద్ర మంత్రులుగా ఎన్నికైన బీజేపీ, టీడీపీ ఎంపీలకు నియోజకవర్గ బీజేపీ నేతలు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణకు చెందిన జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భూపతిరాజు శ్రీనివాసవర్మ, కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌కు అభినందనలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వేంపాటి విష్ణురావు, కోటప్రోలు కృష్ణారావు, కీర్తి వెంకట రామ ప్రసాద్, అడుసుమిల్లి సాయి కృష్ణ, కోకా శ్రీనివాసరావు, వెంకటరాజు, శ్యామలరాజు, వీర రాఘువులు ఉన్నారు.